క్లుప్తంగా

మోడల్ టెస్ట్ పేపర్స్ పంపిణీ



బొల్లాపల్లి : మండల కేంద్రంలోని బండ్లమోటు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ పేపర్స్ పంపిణీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు కె.అపర్ణ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ఈ మోడల్ పేపర్స్ ఎంతో ఉపయోగకరమని, నిష్ణాతులైన ఉపాధ్యాయులచే మెటీరియల్ తయారు చేయబడిందని తెలిపారు. పాఠశాల పూర్వవిద్యార్థి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పి. వెంకటరావు ఆర్థిక చేయూతతో 62 మంది పదో తరగతి విద్యార్థులకు ఈ మోడల్ టెస్ట్ పేపర్స్ పంపిణీ చేశారని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి జి. భాస్కరరావు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పి.వెంకట్రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వాసుపత్రిలో ఉచిత క్యాన్సర్ పరీక్షలు

వినుకొండ (నూజెండ్ల): ఒమేగా క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అబ్దుల్ రజాక్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రారంభిస్తారని తెలిపారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

పెన్షనర్స్ అసోసియేషన్ ట్రెజరర్ అమ్మయ్య మృతి



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ పెన్షనర్స్ అసోసియేషన్ ట్రెజరర్ దాసరి అమ్మయ్య (84) మృతిచెందారు. ఆయన ఎస్ఎస్‌పీలో మెడికల్ ఆఫీసర్‌గా, ఐదు మండలాల్లో ఎంపీహెచ్ఈవో విధులు నిర్వహించి రిటైర్ అయ్యారు. వీరికి ముగ్గురు సంతానం. వీరి మృతికి కాళ్ల కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, దుబ్బల దాసు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

రేపు నడికట్టు రామిరెడ్డి క్యాలెండర్ ఆవిష్కరణ

నాదెండ్ల: చిరుమామిళ్ల శ్రీ నడికట్టు రామిరెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 4న నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్నట్లు సేవా సమితి సభ్యులు యన్నం శివారెడ్డి తెలిపారు. శ్రీ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు జరిగే క్యాలెండర్ ఆవిష్కరణకు ముఖ్యఅతిథిగా విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి హాజరౌతారన్నారు.

ఐఏఎల్ 2025 కోర్టు డైరీ ఆవిష్కరణ



సత్తెనపల్లి: పట్టణంలోని తాలూకా కోర్టు ప్రాంగణంలో న్యాయ దేవత విగ్రహం వద్ద ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్)-2025 కోర్టు డైరీని గురువారం ఆవిష్కరించారు. ఐఏఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరిశేటి వేణుగోపాల్ డైరీని ఆవిష్కరించి, న్యాయవాదులకు పంపిణీ చేశారు. సీనియర్ న్యాయవాదులు పీవీఎస్ఎస్ శాస్త్రి, బీఎల్ చిన్నయ్య, కళ్లం వీర భాస్కరరెడ్డి, పాటిబండ్ల రవి, వి.పాపారావు, బత్తిన శ్రీనివాసబాబు, జూపల్లి శేషయ్య, జె.విజయ్‌కుమార్, కొల్లా వెంకటేశ్వరరావు, చెవల బాలకోటయ్య, జానీ ఖాజావలి, ఆర్‌జీకేఎం మూర్తి, బాబూరావు, హరిబాబు, హరినాథ్, రాజవరపు నరసింహరావు, ఏడుకొండలు, క్రిష్ణారెడ్డి, కిరణ్ కింగ్, బొక్కా సంగీతరావు, గుజ్జర్ల పూడి సురేష్,హరీష్, లక్ష్మణ్, గుమాస్తాలు పాల్గొన్నారు.

పాతపాటేశ్వరి అమ్మవారి ఆదాయం రూ.91 వేలు

గురజాల: పట్టణంలో వేంచేసియున్న పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకుని 16 రోజుల పండుగ సందర్భంగా హుండీ లెక్కింపు జరిగిందని గురజాల మండల దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ఎం.రామచంద్రరావు తెలిపారు. పెదకాకాని గ్రూపు దేవస్థానాల గ్రేడ్ 1 కార్యనిర్వహణాధికారి పి.కృష్ణంరాజు ఆధ్వర్యంలో గురువారం హుండీ లెక్కింపు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆదాయం రూ.90,677 వచ్చినట్లు తెలిపారు. ఈ లెక్కింపులో కనకదుర్గా అమ్మవారి సేవా ట్రస్టు మహిళా సేవకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారని అన్నారు. అలాగే మండలంలోని దైద గ్రామంలో కొలువై ఉన్న అమరలింగేశ్వరస్వామి దేవస్థానంలో లడ్డు ప్రసాదం, పులిహోర రుసుములను కమిషనర్ దేవదాయ ధర్మదాయ శాఖ ఉత్తర్వుల మేరకు ప్రవేశపెట్టటం జరిగిందని, లడ్డు ప్రసాదం 80 గ్రాములకు రూ.15, పులిహోర 150 గ్రాములకు రూ.10గా నిర్ణయించినట్లు చెప్పారు.

జంగిల్ క్లీనింగ్.. జాడెక్కడా?!

- ఖాళీ ప్రదేశాల నిండా పెరిగిన కంప
- కంపలో మురుగు చేరి దోమల వ్యాప్తి



వాసవీ నగర్‌లో చిట్టడవిని తలపిస్తున్న అడవి తుమ్మ చెట్లు

చిలకలూరిపేట: మున్సిపల్ అధికారులు జంగిల్ క్లీనింగ్ అనే మాటను మరిచిపోయారు. గతంలో అప్పుడప్పుడూ.. అక్కడక్కడా జంగిల్ క్లీనింగ్ చేసేవారు. కంప తొలగింపు పనులు చేపట్టక పట్టణంలోని నివాస ప్రాంతాల మధ్య ఉన్న పలు ఖాళీ స్థలాలు దోమల పెంపక కేంద్రాలుగా మారుతున్నాయి. చిట్టడవుల్లా పెరిగిన తుమ్మ చెట్లు, వాటిలో చేరుతున్న వర్షపు, మురుగునీరు దోమల వ్యాప్తికి దోహదం చేస్తున్నాయి. పట్టణంలోని ప్రతి వీధివాసులు దోమల బాధ భరించలేకున్నారు. నిల్వ ఉన్న నీటి కారణంగా దోమలు పెరిగి విష జ్వరాలు సోకుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నా, వీటి నివారణకు పాలకులు, మున్సిపల్ అధికారులు దృష్టి సారించకపోవటం శోచనీయం. పట్టణ పరిధిలో 48 మురికివాడలున్నాయి.

వీటిలో దాదాపుగా ప్రతిచోట ఖాళీ స్థలాల్లో పిచ్చిచెట్లు పెరిగి ఉన్నాయి. ముఖ్యంగా రజకకాలనీ, మోమిన్‌బజార్, రూత్ డైక్‌మెన్ కాలనీ, మారుతీ నగర్, మద్దినగర్, ఎన్టీఆర్ కాలనీ, ఆదిఆంధ్రా కాలనీ, వైఎస్సార్ కాలనీ, వీరముష్టికాలనీ, భావనారుషినగర్ తదితర ప్రాంతాలతో పాటు పట్టణ నడిబొడ్డున ఉన్న సుబ్బయ్య తోట వంటి చోట్ల ఈ పరిస్థితులు నెలకొని ఉంటుంది. కొంతమంది ఇళ్ల నిర్మాణం కోసం కొనుగోలు చేసిన స్థలాలను ఖాళీగా వదిలి వేయటం, మరికొంతమంది భవిష్యత్‌లో స్థలాలకు మంచి ధర పలుకుతుందన్న ఉద్దేశంతో కొని ఖాళీగా వదిలివేయడంతో, ఆ స్థలాల్లో క్రమేపి కంప పెరుగుతున్నది.

నివారణకు చర్యలు శూన్యం

నివాస ప్రాంతాల మధ్య ఖాళీ ప్రదేశాల్లో పెరిగిన ఈ కంపచెట్ల మూలంగా కేవలం దోమలు పెరగటం, అపరిశుభ్ర పరిస్థితులు ఏర్పడటమే కాకుండా, విద్యుత్ లైన్లకు అంతరాయంగా మారుతున్నాయి. వీటిని సంబంధిత స్థల యజమానులకు తొలగించాల్సిందిగా పురపాలక సంఘం ద్వారా నోటీసులు జారీ చేసి తొలగింప జేయాల్సి ఉంటుంది. అదే ప్రభుత్వ స్థలాలు, పోరంబోకులలో పెరిగిన కంపను పురపాలక సంఘం వారే స్వయంగా తొలగించాల్సి ఉంటుంది. అయినా ఎలాంటి జంగిల్ క్లీనింగ్ చర్యలు చేపడుతున్న దాఖలాలు కానరావటం లేదు.



బస్ స్టేషన్ రోడ్డులో పెరిగిన కంప

చర్యలు తీసుకుంటాం



ప్రైవేటు స్థలాల్లో కంప తొలగింపునకు సంబంధిత స్థల యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. మా టౌన్ ప్లానింగ్, శానిటరీ సిబ్బంది స్థల యజమానులను గుర్తించే ప్రక్రియ ప్రారంభించారు. స్పందించని వారి స్థలాల్లో స్థలం పురపాలక సంఘానికి చెందినదిగా బోర్డులు ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వ స్థలాల్లో జంగిల్ క్లీనింగ్ నిర్వహిస్తాం.

– పి శ్రీహరిబాబు, కమిషనర్

బాధితులను ఆదుకోవడం అభినందనీయం



గృహాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆంజనేయులు

వినుకొండ(నూజెండ్ల): అగ్ని ప్రమాద బాధితులను ఆదుకుని, ఇల్లు కట్టించి ఇచ్చిన శాంతి ఆశ్రమ ట్రస్ట్ సేవలు అభినందనీయమని ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ మండలం విఠంరాజుపల్లి ఎస్సీ కాలనీలో శ్రీ హిమాలయ గురువుల ఆశీస్సులతో శాంతి ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన మూడు అగ్ని బాధ్యత పేదల గృహాలను గురువారం ఆయన ప్రారంభించారు. గత ఏడాది మే నెలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సమావేశానికి ఎస్సీ కాలనీలో పాలేటి శోభన్ బాబు, చిరంజీవి, మరియదాసు ఇల్లు దగ్ధం కాగా బాధితులు హిమాలయ గురూజీని ఆశ్రయించడంతో వారి శిష్య బృందం సహకారంతో అగ్నిబాధితులకు ఇల్లు నిర్మించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం నుండి అగ్ని బాధిత కుటుంబాలను ఆదుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు,నాగశ్రీనురాయల్, ట్రస్ట్ సభ్యులు కనిగండ్ల అనంత కోటేశ్వరరావు, పెండేల పుల్లారావు, దాల్ మిల్ ప్రెసిడెంట్ రామదుగు కోటేశ్వరరావు, పెండేల సురేష్, పెండేల మోహన్‌రావు, మునిరెడ్డి, నల్లూరి శంకర్, మాదాల నాగేంద్ర కుమార్, కె.సుధాకర్, బ్రహ్మం పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న ఎంఈఓ 2 కె.పార్వతి



హాజరైన ఎస్ఎంసీ కమిటీ చైర్మన్‌లు

- బొల్లాపల్లి ఎంఈవో -2 కె.పార్వతి
- పాఠశాలల అభివృద్ధిపై ఒకరోజు శిక్షణ

బొల్లాపల్లి : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో ప్రధానోపాధ్యాయులు మండల స్థాయి పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌లకు ఒక రోజు శిక్షణా తరగతులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో -2 కె.పార్వతి అధ్యక్షత వహించి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఎస్ఎంసీ సభ్యులు సహకరించాలని, విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యేలా మౌలిక వసతుల కల్పనలో భాగస్వాములవ్వాలని అన్నారు. ఆయా పాఠశాల పరిధిలో డ్రాప్‌ఔట్, బడిబయట విద్యార్థులను గుర్తించి తల్లిదండ్రులకు విద్య పట్ల అవగాహన కల్పించి పాఠశాలకు వచ్చేవిధంగా ఎస్ఎంసీ కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. శిక్షణలో పాఠశాల సంబంధించి విధులు, బాధ్యతల గురించి వివరించారు. ఆర్పీలు భాస్కర్, వెంకటేశ్వర్లు, రాజశేఖర్, హెచ్ఎంలు, ఎస్ఎంసీ చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఏఎంజీ విద్యార్థిని



కీర్తనను అభినందిస్తున్న స్కూల్ హెచ్ఎం కె.కృపాదానం

చిలకలూరిపేట: జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఏఎంజీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని తాడికీర్తన ఎంపికైంది. ఈ విద్యార్థిని ఇటీవల కర్నూలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా తరుపున పాల్గొని 400 మీటర్ల రిలే పరుగు పందెంలో బంగారుపతకం సాధించటం ద్వారా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల ఐదో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరిగే జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలలో 400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొననుంది. ఈ విద్యార్థినికి గురువారం స్కూల్ ప్రాంగణంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం కె.కృపాదానం, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి



సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారిణి సుమని, విద్యార్థినులు

సత్తెనపల్లి: విద్యార్థినులు సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని వసతిగృహ సంక్షేమ అధికారి పి.సుమని అన్నారు. వెంకటపతి నగర్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహంలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమని మాట్లాడుతూ తెగువ, పట్టుదల, సంకల్ప బలం ఉన్న సావిత్రిబాయి పూలేని 193 సంవత్సరాల తర్వాత కూడా గుర్తు చేసుకుంటున్నామంటే ఆమె త్యాగ నిబద్ధత కారణమన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థిని జీవితంలో స్థిరపడి, సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ మహిళలు, బాలికలు అనేక రంగాల్లో స్వేచ్ఛగా ముందుకు వెళ్తున్నారంటే దానికి కారణం సావిత్రీబాయి పూలే కృషి ఎంతో ఉందన్నారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుమనీని ఫౌండేషన్‌బాధ్యులు ఘనంగా సత్కరించారు. ఫౌండేషన్ కో–ఆర్డి నేటర్ శ్రీలత పాల్గొన్నారు.

వాసవీ మణికంఠ క్లబ్ అధ్యక్షుడిగా కొప్పరావూరి

సత్తెనపల్లి: వాసవీ మణికంఠ క్లబ్ నూతన అధ్యక్షుడిగా కొప్పురావూరి కాశీ వెంకట సుబ్బారావు నియమితులయ్యారు. వీ204–ఏ వాసవి మణికంఠ క్లబ్ అధ్యక్షుడు వనమా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి నూతన కమిటీని నియమించారు. క్లబ్ సెక్రటరీగా సూరే శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా దేవరపల్లి కాశీ విశ్వేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా అనుమాలశెట్టి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా పెండ్యాల సాంబశివరావుతో 1010 ఫాంను డిస్ట్రిక్ గవర్నర్ మునగాల చిరంజీవికి గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ సెక్రటరీ పోతుగంటి రమేష్, ట్రెజరర్ వెల్లంపల్లి కేశవరావు, పోతుగంటి నరసింహారావు, ఆతుకూరి వెంకటహరేరామ చెంచయ్య పాల్గొన్నారు.

అందుబాటులోకి ఎస్‌బీఐ క్యాష్ డిపాజిట్ సేవలు

బ్రాంచ్ మేనేజరు ప్రసాదు

శావల్యాపురం: స్థానిక ఎస్‌బీఐ శావల్యాపురం బ్యాంకు శాఖ వారి సారథ్యంలో ఏటీయం సెంటరు నందు నూతనంగా క్యాష్ డిపాజిట్ యంత్ర పరికరం ప్రారంభించినట్లు ఎస్‌బీఐ బ్యాంకు మేనేజరు వలేటి ప్రసాదు గురువారం తెలిపారు. స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో మేనేజరు మాట్లాడుతూ ఎస్‌బీఐ బ్యాంకు ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు స్థానిక బ్యాంకులో ఖాతాదారుల క్యూలైను రద్దీ తగ్గించటానికి మెరుగైన సేవలు పారదర్శకంగా అందించటానికి క్యాష్ డిపాజిట్ యంత్ర పరికరాన్ని ఏటీయం సెంటరు నందు ఏర్పాటు చేశామన్నారు. డిపాజిట్ యంత్ర పరికరంతో పొదుపు ఖాతాదారులు రోజుకు రూ. 49 వేలు, కరెంటు ఖాతాదారులు రూ. 2 లక్షల వరకు డిపాజిట్ చేసుకోవచ్చునన్నారు. శావల్యాపురంలో ఎస్‌బీఐ కస్టమర్ సెంటర్లు కూడా రెండు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడు లేని విధంగా ఖాతాదారుల సహకారంతో ఇటీవల స్వయం సహాయక మహిళా సంఘాలు గ్రూపులు బ్యాంకులో పొదుపు ఖాతాలు ప్రారంభించగా రెండు గ్రూపులకు రూ. 40 లక్షల రుణాలను మంజూరు చేశామన్నారు. ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాదారులకు భీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నగదు అధికారి శ్రీహరి ఉన్నారు.

పశుగణన సర్వేలో ప్రజల భాగస్వామ్యం కావాలి



శావల్యాపురం: అఖిల భారత పశుగణన సర్వేలో ప్రజలు భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని పశువైద్యాధికారి సోముల గుణధీర్ అన్నారు. గురువారం స్థానిక పశువైద్యశాల్లో వైద్యాధికారి మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఎన్యూమెటర్స్ సారథ్యంలో పశుగణన సర్వే జరుగుతుందని సమగ్ర వివరాలన్నీ మొబైల్ యాప్ నమోదు చేయాలన్నారు. ఇప్పటి వరకు 68 శాతం నమోదు చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు రైతులకు అందాల్సిన పథకాలు తదితరవన్నీ ఈసర్వే చేయటం వలన రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు.

పాఠశాలల బలోపేతంపై శిక్షణ

సత్తెనపల్లి: పాఠశాలల బలోపేతంపై మండల స్థాయిలో ప్రధానోపాధ్యాయులు, స్కూల్ చైర్మన్‌లకు పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో గురువారం శిక్షణ ఇచ్చారు. పాఠశాల యాజమాన్య కమిటీ విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. కోర్సు డైరెక్టర్లుగా ఎంఈఓలు ఎ.శ్రీనివాసరావు, ఎ. రాఘవేంద్రరావు వ్యవహరించారు. రిసోర్స్ పర్సన్‌లుగా షేక్ సాయిబాబు, కె. సురేష్, వెంకయ్య, టి.రాజు, షేక్ హఫీజ్ ఉన్నారు. 130 మంది హెచ్ఎంలు, చైర్మన్‌లు హాజరయ్యారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

దాచేపల్లి ఎంపీడీవో రత్నం



దాచేపల్లి : గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు మెరుగుపర్చాలని ఎంపీడీవో పప్పుల రత్నం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం గురువారం జరిగింది. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తక్షణమే పారిశుద్ధ్య పనులు చేపట్టా లని, మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేయించి బ్లీచింగ్ చల్లించాలని ఎంపీడీవో చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేయాలని, అర్హులకు పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. సమావేశంలో ఈవోపీఆర్డీ గుప్త తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆంజనేయులు

వినుకొండ(నూజెండ్ల): పదోవ తరగతి విద్యార్థులు స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. గురువారం మండల కేంద్రం నూజెండ్లలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు త్రిపురపురం డీసీ చైర్మన్ గంగినేని రాఘవ సారథ్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు పదోవ తరగతి పరీక్షల్లో మెరుగైన సాధించటంతో పాటు లక్ష్యాలను నిర్దేశించుకునే విధంగా ముందుకు సాగితే ఉన్నత శిఖరాల చేరుకోవచ్చునన్నారు. అనంతరం కస్తూరాభా, మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 250 మంది పదోవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పుస్తకాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు, గంగినేని రాఘవరావు, ఎంఈవో ఎస్ రవిచంద్ర, ప్రధానోపాధ్యాయులు జి.శ్రీనివాసరావు, జడ్డా రామయయ, లగడపాటి వెంకట్రావు, గంగినేని ఆంజనేయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం

ఎంఈవో మద్దికుంట సాంబశివరావు



శిక్షణ తరగతుల్లో పాల్గొని మాట్లాడుతున్న ఎంఈవో సాంబశివరావు

శావల్యాపురం: విద్యతోనే సమాజాభివృద్ధి చెందుతుందని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో యాజమాన్య కమిటీ బాధ్యతలు, విధులు తదితర వాటి గురించి విద్యా కమిటీ చైర్మన్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో సాంబశివరావు మాట్లాడుతూ 0–6 నుంచి 15 సంవత్సరాల లోపు కల్గియున్న చిన్నారులు బడి బయట లేకుండా పేదలు విద్యకు దూరం కాకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పాఠశాలకు మంజూరు చేస్తున్న నిధులు వాటి వినియోగంపై ప్రత్యేక దృష్టి సాలించాలన్నారు. అలాగే ప్రతి పాఠశాల్లోని ఉపాధ్యాయులు సమయపాలనతో పాటు క్రమశిక్షణతో కూడిన గుణాత్మక విద్యను విద్యార్థులకు బోధించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుతో పాటు ఉపాధ్యాయుల పనితీరుతో పాటు విద్యార్థులు అభ్యసిస్తున్న విధానాన్ని పరిశీలించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఎదుగుదలతో పాటు చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా నిరంతరం జాగ్రత్తలు సూచనలు చేయాలన్నారు. ఆరోగ్యం పరిశుభ్రత స్వచ్ఛ భారత్ పాఠశాల పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై యాజమాన్య కమిటీలు అవగాహన కల్గి ఉండాలన్నారు. సమావేశంలో ఎంఈవో-2 పుసులూరి లలితకుమారి, రిసోర్స్‌పర్సన్లు బిళ్ళ రాజారమేష్, చెంచులక్ష్మి, మురుగుడు హనుమంతావు ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీలకు 'ధనలక్ష్మి' విద్యార్థులు



రాజేశ్వరి



శివపార్వతి

ఈపూరు (శావల్యాపురం): మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయమా కళాశాలకు చెందిన ప్రథమ యంపీఈడీ విద్యార్థిని యం.రాజేశ్వరి డిసెంబరు 29,30 తేదీల్లో చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల్లో జరిగిన అంతర్ కళాశాలల టోర్నమెంటులో పాల్గొని యూనివర్సిటీ జట్టుకు రాష్ట్ర వాలీబాల్ టీంకు ఇరువురు విద్యార్థినులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు చుండు వెంకటరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెలలో జప్పియార్ యూనివర్సిటీ చెన్నైలో జరిగే సౌత్ జోన్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ జట్టుకు ప్రాతినిథ్యం వహించునున్నట్లు తెలిపారు. అలాగే కళాశాలకు చెందిన యం.పి.ఇడి విద్యార్థిని ఏవీ శివపార్వతి డిసెంబరు 27న ఐ.జీయంసీ స్టేడియం విజయవాడలో జరిగిన సీనియర్స్ విభాగంలో పాల్గొని రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో జరిగే వాలీబాల్ పోటీలలో ఏపీ టీంకు ప్రాతినిథ్యం వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు ఆర్‌బీ నాయక్, అరవింద్, దాసు, వంశీలు ప్రత్యేకంగా అభినందించారు.

దివ్యమనోహరం శ్రీవారి దర్శనం





సత్తెనపల్లి: ధనుర్మాసం పురస్కరించుకొని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం శ్రీవారికి దివ్య మనోహర రూపా స్వామిగా అలంకరించి, పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ శ్రీవారి సేవా సమాజం ఏర్పాట్లను పర్యవేక్షించింది.

గోదాదేవికి 108 ప్రసాదాల నైవేద్యం

సత్తెనపల్లి: ధనుర్మాసం పురస్కరించుకొని వడ్డవల్లి శ్రీరామాలయం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారిని నిజపాద దర్శనంలో భక్తులు దర్శించుకుని, పూజించారు. గోదాదేవికి 108 రకాల ప్రసాదాలతో నైవేద్యం సమర్పించారు.

వామనావతార.. శ్రీరామచంద్ర

అచ్చంపేట: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలందుకున్న సీతా సమేత శ్రీరామచంద్రునికి గురువారం అచ్చంపేటలో గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారిని దశావతారాల్లో ముఖ్యమైన వామనుడిగా ఆలంకరించి, ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య మహిళా విభాగం అమ్మవారి సహస్ర, అష్టోత్తర శతనామార్చన పారాయణ పఠించింది. పలు గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు.